సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తుదారుకు రసీదు ఇస్తున్న మేయర్ సునీల్‌రావు

రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు కోరారు. నగరంలోని 54వ డివిజన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన హాజరై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఈ నెల 6 వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రతి డివిజన్‌లో దరఖాస్తుల స్వీకరణకు అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. కొత్త రేషన్ కార్డు కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. -కార్పొరేషన్, జనవరి 2

సద్వినియోగం చేసుకోవాలి

దరఖాస్తు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కార్పొరేషన్, జనవరి 2: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. నగరంలోని ఖాన్‌పుర, అశోక్‌నగర్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రేషన్ కార్డు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పొరపాట్లు లేకుండా నింపి అధికారులకు అందించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాంపెల్లి శ్రీనివాస్, బల్దియా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన నేతలు, అధికారులు

కార్పొరేషన్, జనవరి 2: భగత్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మేయర్ యాదగిరి సునీల్‌రావును మంగళవారం 22వ డివిజన్ కార్పొరేటర్ గంట కళ్యాణి-శ్రీనివాస్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, బల్దియా ఇంజినీరింగ్ అధికారులు, అలయన్స్ క్లబ్ సభ్యులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సున్నిత సెగ్మెంట్ల గుర్తింపుపై ఈసీ దృష్టి

- జిల్లాలో ఇంటలిజెన్స్ కమిటీ ఏర్పాటు

కలెక్టరేట్, జనవరి 2: జిల్లాలో సున్నితమైన అసెంబ్లీ నియోజకవర్గాల గుర్తింపుపై ఎన్నికల సంఘం దృష్టిసారించింది. ఎన్నికల కమిషన్ నుంచి ఈమేరకు ఉత్తర్వులు విడుదల చేయగా, అమలుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తున్నది. ఇందుకోసం జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ఇంటలిజెన్స్ కమిటీని మంగళవారం అధికారులు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, ఐటీ, జీఎస్టీ, బ్యాంకులు, పోలీస్ శాఖ అధికారులు సభ్యులుగా ప్రత్యేక బృందాన్ని నియమించారు. వీరంతా గత అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థుల వ్యయం, పంపిణీ చేసిన మద్యం, నజరానాలపై సమగ్ర నివేదిక రూపొందించనున్నారు. ఈ నివేదిక ఆధారంగా జిల్లాలో సున్నిత వ్యయ అసెంబ్లీ సెగ్మెంట్లు, ప్రాంతాలను గుర్తించి ఆయా చోట్ల రాబోయే ఎన్నికల్లో ఎన్నికల సంఘం ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టనున్నది. ఎలాంటి సమస్యలకు ఆస్కారం లేకుండా సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించే అవకాశాలున్నాయి. కాగా, రాబోయే పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.

ప్రాథమిక నివేదిక అందించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఇంటలిజెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ సూచన మేరకు ఏర్పాటు చేసిన ఈ కమిటీ గత అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు చేసిన ఖర్చు, పట్టుకున్న మద్యం, పంపిణీ చేసిన నజరానాల సమాచారం ఆధారంగా నివేదిక రూపొందించాలని సూచించారు. కమిటీ అందించే ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఏసీపీ కిష్టయ్య, ఆదాయపన్ను శాఖాధికారి ఆర్ రాజేశ్, జీఎస్టీ అధికారి మదనయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి చేయాలి

కలెక్టరేట్, జనవరి 2: మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సంక్షేమాధికారి సరస్వతి పిలుపునిచ్చారు. స్థానిక సప్తగిరికాలనీలో గల సఖీ కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమాధికారి సరస్వతి మాట్లాడుతూ, మహిళల ఆర్థిక బలోపేతానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో మహిళా సాధికారిత కేంద్రం జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ శ్రీలత, సఖీ అడ్మిన్ లక్ష్మి, వీ హబ్ స్కిల్ కో ఆర్డినేటర్ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ

అయ్యప్ప స్వాములతో మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కమాన్‌చౌరస్తా, జనవరి 2: స్థానిక జడ్పీ క్వార్టర్స్ ఆవరణలో గల అయ్యప్ప ఆలయంలో మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్-డాక్టర్ మాధవి దంపతుల సౌజన్యంతో తెలంగాణ అయ్యప్ప సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్ గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం 108 మంది కన్నె స్వాములతో మహాపడిపూజ నిర్వహించారు. అంతకుముందు స్వామి వారికి విశేష అభిషేకం, అర్చన చేశారు. మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ హాజరై ఆలయంలో పూజలు నిర్వహించారు. పూజల్లో బొల్లు నరేందర్, లింగంపల్లి సత్యనారాయణ, మంద వెంకన్న, పల్లె నారాయణగౌడ్, దిలీప్, మురళి, గంగాధర్, రాజేశ్వర్ రావు, రవీందర్ రావు, తిరుపతిగౌడ్, జయపాల్, సుధాకర్, వెంకటస్వామి, ఈవో కాంతారెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడిట్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న స్టేట్ ఆడిట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు

కలెక్టరేట్, జనవరి 2: స్టేట్ ఆడిట్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ఆ శాఖ రాష్ట్ర సంచాలకుడు మార్తినేని వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఆడిట్ ఉద్యోగులు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సన్మానించారు. అలాగే, ఆడిట్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పారికరామును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, ఆడిట్ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రాజ్ కుమార్, సహాయ ఆడిట్ అధికారి సీహెచ్ జోయల్ రాజేశ్వర్‌రావు, వంశీ, పవన్, రవిచంద్ర, ప్రకాశ్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత

విద్యానగర్, జనవరి 2: గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కరీంనగర్ శాఖ ఖాతాదారు ఊర సంపత్ ప్రమాదంలో మృతి చెందాడు. బీమా సొమ్ము రూ. లక్ష మంజూరు కాగా, మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ కృష్ణ, సీనియర్ ఆఫీసర్ విష్ణుధర్, జూనియర్ ఆఫీసర్ విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో పాలన

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, జనవరి 2: పల్లె ప్రజలకు అందుబాటులో ప్రజాపాలన అందిస్తున్నామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని మహాత్మానగర్, మల్లాపూర్, మన్నెంపల్లి గ్రామాల్లో అభయహస్తం గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆన్‌లైన్‌లో ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతోనే ప్రభుత్వం గ్రామగ్రామాన ప్రత్యేక కౌంటర్లు పెట్టి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తు ఫారాలు కొనవద్దని, ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందన్నారు. ప్రజల నుంచి అర్జీలను ఈ నెల 6న సాయంత్రం 6గంటల వరకు మాత్రమే తీసుకుంటామని స్పష్టం చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ కేతిరెడ్డి వనితాదేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఏవో సురేందర్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బస్సుల్లో వెళ్తున్నరా.. అవ్వా?

- మాకు బస్సే లేదు సారూ!

ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించడానికి మల్లాపూర్‌కు వచ్చిన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ.. ప్రభుత్వ ఆరు గ్యారంటీల్లో ఒకటైన మహాలక్ష్మీ పథకంపై ఆరా తీస్తుండగా, ప్రజల నుంచి ఊహించని సమాధానం ఎదురైంది. ఉచిత ప్రయాణ సౌకర్యం గురించి అక్కడ ఉన్న మహిళలకు ఎమ్మెల్యే వివరిస్తూ.. 'ఎంతమంది వెళ్తున్నారు బస్సుల్లో' అని అడుగగా, వారు 'మా గ్రామానికి బస్సే లేదు సారు. ఎక్కడికి పొమ్మంటవూ' అంటూ ప్రశ్నించారు. స్పందించిన ఆయన, అధికారులతో మాట్లాడి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇక గ్రామంలో అధికారులు కౌంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ ఎమ్మెల్యే వచ్చే వరకు దరఖాస్తులు తీసుకోకపోవడంతో ప్రజలు వేచిచూసి విసిగిపోయారు.

ప్రజాపాలన దరఖాస్తులను డిజిటలైజ్ చేయాలి

మానకొండూర్ రూరల్, జనవరి 2: ప్రభుత్వం అభయ హస్తం ఆరు గ్యారంటీల అమలు దిశగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమానికి వస్తున్న దరఖాస్తులన్నింటినీ డిజిటలైజ్ చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం మానకొండూర్ మండలం కెల్లేడు గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఇక్కడ తహసీల్దార్ సీహెచ్ రాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఫైర్ సిబ్బందికి సత్కారం

రాంనగర్, జనవరి 2: జిల్లా కేంద్రంలోని ఫైర్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న డీ ప్రభాకర్, బీ రాంచందర్, ఆంజనేయులు, మునీంద్రచారికి రాష్ట్ర ప్రభుత్వం సేవా పురస్కారాలు ప్రదానం చేసింది. కాగా, వారిని స్థానిక ఫైర్ స్టేషన్‌లో డివిజనల్ ఫైర్ ఆఫీసర్ వెంకన్న అభినందించి, సత్కరించారు. ఫైర్ ఆఫీసర్లు పరమేశ్వర్, భూదయ్య, అనిల్‌కుమార్ ఉన్నారు.

- నరేంద్రమోదీ మళ్లీ ప్రధాని కావడం ఖాయం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

విద్యానగర్, జనవరి 2: ఆరు గ్యారెంటీల అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమవుతుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. నగరంలోని 'శుభమంగళ' గార్డెన్స్‌లో బీజేపీ మండలాధ్యక్షులు, కొత్తగా ఎంపిక చేసిన ఇన్‌చార్జిలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఏ సంస్థ సర్వే చేసినా 80 శాతానికి పైగా ప్రజలు మోదీనే మళ్లీ ప్రధానమంత్రి కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. తెలంగాణలోనూ బీజేపీ 8 నుంచి 12 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ సర్కార్ మనుగడ ఇబ్బందికరంగా మారే అవకాశాలు కన్పిస్తున్నాయన్నారు. కేంద్రం నుంచి నిధులు రావాలంటే బీజేపీకి ఓటేయడమే మేలనే అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పనిచేసే వాళ్లకు, మెరుగైన ఫలితాలు తెచ్చిన వాళ్లకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్లు ఇస్తామన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా పోటీ చేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు. పార్టీలో ఒకరిద్దరు నాయకులు పార్టీకి నష్టం చేస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందని, అలాంటి వాళ్లను ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు.

త్వరలో కరీంనగర్-హసన్‌పర్తి రైల్వే లేన్ పనులు ప్రారంభం

అతి త్వరలోనే కరీంనగర్-హసన్‌పర్తి రైల్వే లైన్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఎంపీ బండి సంజయ్ కుమార్ చెప్పారు. నగరంలోని పద్మశాలీ భవన్‌లో సంఘం అఫీషియల్స్, ప్రొఫెషనల్స్, యూత్ అసోసియేషన్స్ వేర్వేరుగా రూపొందించిన క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సమావేశాల్లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్ రెడ్డి, కార్యదర్శి బొమ్మ జయశ్రీ, అధికార ప్రతినిధి సీహెచ్ విఠల్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు జీ కృష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణ, ఇన్‌చార్జులు చంద్రయ్య, మోహన్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేస్తాం: ఎమ్మెల్యే

చొప్పదండి, జనవరి 2: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 100రోజుల్లో ఆరు గ్యారెంటీల పథకాలను తప్పక అమలు చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మంగళవారం చొప్పదండి పట్టణంలోని 7,8,11వ వార్డుల పరిధిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పనుల కోసం ఎవరైనా కమీషన్లు అడిగితే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. తనపై నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ-భూమారెడ్డి, కౌన్సిలర్లు పెరుమడ్ల మానస-గంగయ్య, కొట్టె అశోక్, వైస్ ఎంపీపీ మునిగాల విజయలక్ష్మి-చందు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు పురం రాజేశం, కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ పుల్కం నర్సయ్య, పార్టీ పట్టణాధ్యక్షుడు ముద్దం తిరుపతి, బీసీసెల్ ప్రధాన కార్యదర్శి గుర్రం రమేశ్ గౌడ్, గుర్రం రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి దరఖాస్తు తీసుకుంటున్న ఎమ్మెల్యే సత్యం

అధ్యాపకులకు ఉద్యోగోన్నతి

కమాన్‌చౌరస్తా, జనవరి 2: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో నలుగురు అధ్యాపకులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు కళాశాల విద్యా శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి నుంచి హిందీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ వరప్రసాద్, వృక్ష శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ టీ శంకర్, వాణిజ్య శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ సతీశ్ కుమార్, మైక్రో బయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ పీ ముత్తన్నకు ఉద్యోగోన్నతి కల్పించింది. అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ, ఉప ప్రధానాచార్యుడు రాజయ్య, రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ కే సురేందర్ రెడ్డి, కళాశాల స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్, ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం (డైరెక్ట్) కరీంనగర్ బాధ్యుడు డాక్టర్ కిశోర్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు, తదితరులు అభినందనలు తెలిపారు.

సీసీఐ విక్రయానికి 'ఆధార్' ప్రామాణికం

- రైతులు ముందు రోజే అధికారులకు తెలియజేయాలి
- జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పద్మావతి

జమ్మికుంట, జనవరి2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉన్న పత్తి మార్కెట్ యార్డు/నోటిఫై చేయబడిన మిల్లుల్లో పత్తి విక్రయించేందుకు రైతుల ఆధార్ కార్డును మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటున్నారని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పద్మావతి(డీఎంవో) తెలిపారు. ఆధార్‌కు మొబైల్ నంబర్, భూమి, బ్యాంకు అనుసంధానం చేసుకున్న విషయాల గురించి రైతులు ఒక రోజు ముందుగానే మార్కెట్ అధికారులకు ఫోన్ చేసి తెలుసుకోవాలని, ఇబ్బందుల్లేకుండా కాటన్‌ను అమ్ముకోవాలని సూచించారు. మంగళవారం ఆమె జమ్మికుంట కాటన్ మార్కెట్ యార్డులో కొనుగోళ్లను పరిశీలించారు. తర్వాత కార్యాలయంలో ఇప్పటి వరకు జరిగిన క్రయ, విక్రయాలు, మార్కెట్ ఫీజు వసూళ్లు, నూతన ఆన్‌లైన్ పద్ధతులు, తదితర అంశాలపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం పద్మావతి మాట్లాడుతూ.. రైతుల సౌకర్యం కోసం ఆరుగురు మార్కెట్ అధికారులు, సిబ్బంది పేర్లు, ఫోన్ నంబర్లను వెల్లడించారు. గ్రేడ్-2 కార్యదర్శి రాజా (9948508301), సూపరింటెండెంట్లు లక్ష్మణ్ (9440763270), యాకయ్య (9989418139), ఏఎంఎస్ బాబా (9949438140), అరుణ్ (8074574473), శంకర్ రెడ్డి (8978482069) అందుబాటులో ఉంటారని, రైతులు ఫోన్ చేసి ఆధార్ నంబర్ చెబితే పత్తి అమ్ముకునే వివరాలు అందిస్తారని చెప్పారు. ప్రతి రైతుకు మద్దతు ధర అందించేందుకే చర్యలు చేపట్టామని వెల్లడించారు. సీసీఐకి అమ్ముకునే రైతులు నిబంధనలు పాటించాలని, క్వింటాల్‌కు మద్దతు ధర రూ.7020 పొందాలని తెలిపారు. 8-12శాతం వరకు తేమ ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని చెప్పారు. గత నవంబర్ 6 నుంచి జిల్లాలోని మార్కెట్లలో కొనుగోళ్లు ప్రారంభించామని, జమ్మికుంట, కరీంనగర్, చొప్పదండి, గోపాల్‌రావుపేట మార్కెట్ పరిధిలోని 12 మిల్లుల్లో 70,204 క్వింటాళ్లు కొన్నారని చెప్పారు. అలాగే, ప్రైవేట్ ట్రేడర్లు కరీంనగర్, జమ్మికుంట, చొప్పదండి మిల్లుల్లో నేరుగా 96,110 క్వింటాళ్లు, యార్డుల్లో 57,832 క్వింటాళ్లు కొన్నటుల తెలిపారు. క్రయ, విక్రయాల్లో రైతులకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకునేది లేదని, ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ గ్రేడ్-2 కార్యదర్శి రాజా, సిబ్బంది తదితరులున్నారు.

కలెక్టర్‌ను కలిసిన మేయర్, టీఎన్జీవోస్ నేతలు

కార్పొరేషన్/ తెలంగాణచౌక్/కలెక్టరేట్, జనవరి 2: నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ పమేలా సత్పతిని మంగళవారం యాదగిరి సునీల్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, కలెక్టర్‌కు బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, యువజన సంఘం పట్టణాధ్యక్షుడు కాస రాజు పుష్పగుచ్ఛం, తిరుపతి ప్రసాదం అందజేసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతికి టీఎన్జీవోస్ జిల్లా నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు, నాయకులు నాగుల నర్సింహస్వామి, రాగి శ్రీనివాస్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఒంటెల రవీందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అఫ్జలొద్దీన్, గంగారపు రమేశ్, సర్దార్ హర్మీందర్‌సింగ్, సుమంత్, మారుపాక రాజేశ్‌భరద్వాజ్, కిషన్, పోలు కిషన్, ఇరుమల్ల శారద, సబితారెడ్డి, విజయలక్ష్మి, సరిత, సుస్మిత, శైలజ, రాధిక, మల్కా రాజేశ్వర్‌రావు, మహ్మద్ అజ్గర్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోట రామస్వామి, నరసింహారెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేశవరెడ్డి, లింగయ్య, చల్ల మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

కొత్తపల్లి, జనవరి 2: నగరంలోని కోరా, జాన్సన్ పాఠశాలల విద్యార్థులు కౌశిక్, గీతిక జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి అభినందించారు.

క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

చొప్పదండి, జనవరి 2: క్రీడాకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో ఏసియన్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు హంకాంగ్‌కు వెళ్తున్న జాతీయ క్రీడాకారులు ఆంజనేయులు, చందన, కోచ్ మల్లేశానికి సన్మాన కార్యక్రమం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ-భూమారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నలుగురికి కరోనా పాజిటివ్

విద్యానగర్, జనవరి 2: నగరంలోని ప్రభుత్వ దవాఖానలో మంగళవారం 93 మందికి ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయగా నలుగురికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు సమాచారం. ఇందులో 18 నెలల చిన్నారికి సైతం కరోనా పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు.

అపోలో రీచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

విద్యానగర్, జనవరి 2: జిల్లా కేంద్రంలోని అపోలో రీచ్ దవాఖానలో అరుదైన శస్త్ర చికిత్స చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మల్యాల మండలానికి చెందిన పోచంపల్లి రాజమల్లయ్య (68) ఛాతిలో నొప్పితో పాటు శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు పడుతూ కరీంనగర్‌లోని అపోలో రీచ్ దవాఖానకు వచ్చారు. డాక్టర్ సంతోష్ దంగేటి పరీక్షించి గుండెలోని ప్రధాన రక్తనాళాలు పూర్తిగా మూసుకుపోయినట్లు గుర్తించారు. గతనెల 28న మిక్స్ (మినిమల్ ఇన్వాసివ్ కార్డియోతురాసిక్ సర్జరీ) ద్వారా శస్త్ర చికిత్స విజయవంతంగా చేశారు. రాజమల్లయ్య పూర్తిగా కోలుకోగా మంగళవారం డిశ్చార్జి చేసినట్లు వైద్యులు సంతోష్, డాక్టర్ సతీశ్ తెలిపారు.

దొంగ అరెస్ట్

రాంనగర్, జనవరి 2: నగరంలోని కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో మూడు రోజుల క్రితం జరిగిన ఓ కార్యక్రమాన్ని చిత్రీకరించేందుకు వచ్చిన ఓ మీడియా సంస్థ కెమెరామెన్ కెమెరా బ్యాగును గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు వన్‌టౌన్ సీఐ సరిలాల్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఆధారంగా పాత నేరస్తుల వివరాలను పరిగణలోకి తీసుకుని దర్యాప్తు చేశారు. నిందితుడు కట్టరాంపూర్‌కు చెందిన జునుగారి శంకర్‌గా గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి వీడియో కెమెరాను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరుచనున్నట్లు ఏసీపీ నరేందర్ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న సిబ్బంది హసనొద్దీన్, బషీర్‌ఖాన్‌ను అభినందించారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

తిమ్మాపూర్, జనవరి 2: కొత్త సంవత్సర వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘించిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగునూర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు డిసెంబర్ 31 వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి సమయంలో రహదారిపై అనుమతి లేకుండా పటాకులు కాల్చడంతో పాటు, అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. ఘటనపై విచారించిన పోలీసులు.. బాధ్యులైన గోపు మల్లారెడ్డి, బైరి రాజు, బుర్ర లక్ష్మణ్, రమేశ్‌పై కేసు నమోదు చేశారు. నిందితులను మంగళవారం రిమాండ్ చేయగా, సాయంత్రం వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసిందని ఎస్ఐ తెలిపారు.

వ్యాపారి భార్య ఆత్మహత్య

వాసంతి (ఫైల్)

రాంనగర్, జనవరి 2: నగరానికి చెందిన ప్రముఖ హోటల్ వ్యాపారి రాజీవ్‌శెట్టి భార్య ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ప్రముఖ హోటల్ వ్యాపారి రాజీవ్ శెట్టి ఉమ్మడి జిల్లాలో హోటల్ రంగంలోనే పేరు గడించి కొన్నేళ్ల పాటు హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశారు. నాలుగేళ్ల క్రితం తన స్వగ్రామం ఉడిపి వెళ్లి వస్తుండగా మృతి చెందడం అప్పట్లో సంచలనం రేపింది. కొద్ది రోజులకే ముకరంపుర లోని ఇంట్లో రాజీవ్‌శెట్టి భార్యపై గుర్తు తెలియని దుండగుడు కత్తితో దాడికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. తిరిగి కేసు వాపస్ తీసుకోవడం అనుమానాలకు తావిచ్చింది. ఈ క్రమంలో ఆస్తి గొడవలు ఉన్నాయనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఊహాగానాలు వినిపించిన సమయంలోనే ఇంట్లో దొంగలు పడి విలువైన పత్రాలు, డబ్బులు పోయాయని ఫిర్యాదు చేయడం కూడా అప్పట్లో సంచలనం రేపింది. తాజాగా మంగళవారం మధ్యాహ్నం పోలీసులకు రాజీవ్‌శెట్టి కుటుంబ సభ్యులు ఫోన్ చేసి అతని భార్య వాసంతి (62) ఆత్మహత్యకు యత్నించిందని, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వారి సమక్షంలోనే మృతదేహాన్ని ప్రైవేట్ దవాఖాన నుంచి ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. వాసంతి ఒంటికి నిప్పంటించుకొని మృతి చెందిందని బంధువులు తెలుపుతుండగా ఆమెను దవాఖానకు తరలించిన చాలా సేపటి తరువాత పోలీసులకు సమాచారం ఇవ్వడంపై అనుమానాలు తలెత్తాయి. అయితే, పోలీసులు ఇంట్లో సీసీ ఫుటేజీలను పరిశీలించి దర్యాప్తు కోసం డీవీఆర్ బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. వాసంతి మృతదేహాన్ని బంధువులు ప్రభుత్వ దవాఖానకు తరలించగా, రాజీవ్‌శెట్టి కొడుకు మాత్రం అదే ప్రైవేట్ దవాఖానలో అనారోగ్యంతో అడ్మిట్ కావడం, పోస్టుమార్టం పూర్తి కాగానే దవాఖానకు వచ్చి మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉడిపికి తరలించాడు. వాసంతి సోదరుడు శివరాంశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు జరిపి పూర్తి వివరాలు తెలియజేస్తామని పేర్కొన్నారు.

ఆవు అదృశ్యంపై ఫిర్యాదు

శంకరపట్నం, జనవరి 2: మొలంగూర్‌లో ఓ ఆవు సోమవారం రాత్రి అదృశ్యం కాగా, దాని యజమానులు గాజుల కుమారస్వామి-పద్మ దంపతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం తెల్లవారే సరికి ఆవు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తమ ఆవును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని భార్యాభర్తలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

ఇంధన కష్టాలు

- పెట్రోల్ బంకుల వద్ద వాహనదారుల బారులు

నగరంలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద బారులు తీరిన వాహనదారులు

కార్పొరేషన్/విద్యానగర్/ మానకొండూర్/ రూరల్/ శంకరపట్నం, జనవరి 2: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన మోటార్ వాహనాల చట్టసవరణ బిల్లుకు వ్యతిరేకంగా ట్యాంకర్ డ్రైవర్లు సమ్మెకు దిగారన్న ప్రచారంతో మంగళవారం వాహనదారులు అప్రమత్తమయ్యారు. కరీంనగర్ జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ కొనుగోలు కోసం వాహనాలతో పాటు పెద్ద పెద్ద క్యాన్లతో బారులు తీరారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని రెండు, మూడు బంకులు నోస్టాక్ బోర్డులు పెట్టగా, మానకొండూర్, శంకరపట్నంతోపాటు నగరంలోని మిగతా బంకుల్లో ఇంధనం కొనుగోలు కోసం గంటల తరబడి పెద్ద సంఖ్యలో వాహనదారులు నిరీక్షించారు. కేంద్రం త్వరలోనే డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించే అవకాశం ఉందని ఇప్పటికే ప్రచారం జరుగుతున్న క్రమంలో పలు బంకుల యజమానులు స్టాక్ తీసుకురాకపోవడంతో ఇంధనం కొరత కనిపించింది.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024. NT-319403-All

CHANGE OF NAME

★I, VANCHA MAHENDER, S/o. Vancha Raji Reddy, R/o. 1-69, Deshrajpally, Ramadugu, Karimnagar, TS, Changed My Name as VANCHA MAHENDER REDDY, S/o. Vancha Raji Reddy. NT-319315

★I, KOMMU CHANDRAIAH, S/o. Kommu Lingaiah, R/o. 5-97, Mallareddipet, Rajanna Sircilla, TS. Changed My Name as KOMMU CHANDRAM, S/o. Kommu Lingaiah. NT-319315

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.